సాక్షి
మంచిర్యాల
సోమవారం : 12 : ఫిబ్రవరి : 2024



నేడు నాగోబా దర్బార్

నాగోబా జాతరలో భాగంగా కేస్లాపూర్‌లోని ఆలయంలో నేడు దర్బార్ నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలోని హాల్‌లో ఈ కార్యక్రమం చేపట్టనున్నారు. 8లో▸



ప్రశాంతంగా గురుకుల సెట్

తెలంగాణ గురుకుల కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(టీజీసెట్) ఆదివారం ఆదిలాబాద్ రీజియన్‌లో ప్రశాంతంగా జరిగింది. 95.5 శాతం విద్యార్థులు హాజరయ్యారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.1 /20.0

ఆకాశం చాలావరకు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. చలి ప్రభావం తగ్గుతుంది.

న్యూస్‌రీల్

దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి

- మావోయిస్టు సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ 16న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెలో సింగరేణి కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, అసంఘటిత కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు పార్టీ) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మోదీ ప్రభుత్వం ప్రజల జీవన విధానాన్ని హరిస్తూ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతోందని ఆరోపించారు. కార్మిక చట్టాలను సైతం కుదిస్తూ కార్పొరేట్, పెట్టుబడిదారులకు అనుకూలమైన చట్టాలు రూపొందిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించడమే లక్ష్యంగా పెట్టుకుందని ఆరోపించారు. ప్రభుత్వరంగ సంస్థలను, అటవీ, కార్మిక చట్టాలను సంరక్షించుకునేందుకు, ప్రజలు జీవించే హక్కు కోసం, ఆదివాసీలపై దాడుల నివారణకు, రాజ్యాంగం ఇచ్చిన చట్టాల అమలు కోసం ఈనెల 16న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు.

బడ్జెట్ కేటాయింపుల్లో బీసీలకు అన్యాయం

- బీసీ సంఘాల ఐక్య వేదిక నాయకులు




మాట్లాడుతున్న గుమ్ముల శ్రీనివాస్

పాతమంచిర్యాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీలకు అరకొర నిధులు కేటాయించిందని బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని(వేములపల్లెలో) ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో బీసీలు 56 శాతం ఉంటే కేవలం 2 శాతం నిధులు మాత్రమే కేటాయించడం బీసీలను అవమానించడమే అని పేర్కొన్నారు. బడ్జెట్ సమావేశాలకు ముందు బీసీలకు రూ.50 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్ సభలో బీసీలకు రూ.లక్ష కోట్లు కేటాయిస్తామని చెప్పిందని గుర్తు చేశారు. బీసీలపై ప్రభుత్వం వివక్ష చూపకుండా జనాభాకు అనుగుణంగా బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీల ఐక్య వేదిక నాయకులు సూర్ల శంకర్ రాజ్‌కుమార్, గుమ్ముల గోపాల్ పాల్గొన్నారు.

జిల్లాలో ముగ్గురు ఎస్సైలు బదిలీ

మంచిర్యాలక్రైం: కాళేశ్వరం మల్టీ జోన్–1 పరిధిలో 12 మంది ఎస్సైలను బదిలీ చేస్తూ మల్టీ జోన్–2 ఐజీ, రామగుండం ఇన్‌చార్జి సీపీ తరుణ్‌జోషి ఆదివారం ఉత్తర్వులను జారీ చేశారు. మంచిర్యాల పోలీస్ స్టేషన్ ఎస్సైగా పనిచేసిన ఎ.రాజేందర్‌ను కోటపల్లికి బదిలీ చేశారు. కోటపెల్లి ఎస్సై సురేశ్‌ను రామగుండం పోలీస్ కమిషనరేట్‌కు, తాండూర్ ఎస్సై రాజశేఖర్‌ను మందమర్రి–2 ఎస్సైగా బదిలీ చేశారు. మంచిర్యాల, తాండూర్ పోలీస్ స్టేషన్లకు ఎవరినీ కేటాయించలేదు.

పవర్‌ప్లాంట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరాహారదీక్ష చేస్తున్న కార్మికులు

పాతమంచిర్యాల: శాలీవాహన గ్రీన్‌ఎనర్జి బయోమాస్ పవర్ ప్లాంట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కార్మిక సంఘం అధ్యక్షుడు కుంటాల శంకర్ డిమాండ్ చేశారు. పవర్ ప్లాంట్ మూసివేసి 15 నెలలు కావొస్తున్నా కార్మికులకు రావాల్సిన వేతనాలు, ఇతర బకాయిలు చెల్లించకుండా యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. 12 రోజులుగా ప్లాంట్ గేట్ ఎదుట దీక్ష చేస్తున్నా స్పందించడం లేదన్నారు. యాజమాన్యం నిర్లక్ష్యం వీడకుంటే ప్లాంట్ మేనేజింగ్ డైరెక్టర్ ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు.

బినామీల ఏరివేత ఎందాకా?

- రేషన్‌షాపుల్లో నామమాత్రంగా తనిఖీలు
- పరిశీలనలో అధికారుల ముందు అంతా ఓకే
- జిల్లాలో ఇప్పటికే తొమ్మిది మండలాల్లో పూర్తి
- తనిఖీల సమయంలో చిక్కకుండా జాగ్రత్తలు



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: చౌకధరల దుకాణాల్లో బినామీల ఏరివేతలో ఉదాసీనత వీడడం లేదు. ఇటీవల 'సాక్షి'లో ప్రచురితమైన 'అద్దెకు డీలర్‌షిప్' కథనానికి స్పందించిన జిల్లా ఉన్నతాధికారులు పకడ్బందీగా పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అయినా ఇప్పటివరకు జిల్లాలో ఎక్కడా ఒక్కరు కూడా గుర్తించకపోవడం గమనార్హం. జిల్లా కేంద్రంతోపాటు 18మండలాల పరిధిలో 423 దుకాణాల్లో చాలా చోట్ల వాస్తవ డీలర్ల స్థానంలో వేరే వాళ్లే బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఆ పరిధిలోని లబ్ధిదారుల్లో ప్రతి నెలా ఎవరు బియ్యం పంపిణీ చేస్తున్నారని అడిగినా తెలిసిపోతుంది. నామమాత్రంగా పరిశీలన చేయడంతో బినామీల బాగోతం బయటపడడం లేదు. చాలాచోట్ల తూతూ మంత్రంగానే పరిశీలనలు చేయడంతో అసలు డీలర్లతోపాటు చాలా చోట్ల సంబంధం లేని వ్యక్తులు కూడా బియ్యం సరఫరాలో ఉంటున్నారు. దీంతో బియ్యం పెద్దయెత్తున ప్రతీ నెల పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలున్నాయి. ప్రతీ రేషన్ దుకాణంలో స్టాక్, లబ్ధిదారులకు బియ్యం పంపిణీ, రికార్డులు, సమయపాలన తదితర వివరాలు పక్కాగా తనిఖీలు చేయాల్సి ఉన్నా నామమాత్రంగానే సాగడంతో ఇవేవీ వెలుగులోకి రావడ లేదు. ఇటీవల రేషన్ డీలర్ల సంఘ నాయకులు, అధికారులతో అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ) మోతీలాల్ గట్టిగా హెచ్చరించారు. బినామీలను గుర్తించి చర్యలు తీసుకుంటామని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో పకడ్బందీగా తనిఖీలు చేయడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

అనర్హులను ఏరివేస్తేనే..

లీజు చొప్పున కొందరు డీలర్లు అర్హత లేకున్నా వేరే వ్యక్తుల చేతిలో పెట్టడంతో ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలకు తావిస్తున్నాయి. కొందరు డీలర్లే లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసి నల్లబజారుకు తరలిస్తున్నారు. ఇప్పటికే ఇలాంటి డీలర్ల అక్రమాలు బయటకు వచ్చాయి. ఈ క్రమంలో అనర్హులను ఏరివేసి ఆ స్థానంలో నిరుద్యోగులకు అవకాశం ఇస్తే మేలు జరిగే అవకాశం ఉంది. మరోవైపు చాలా చోట్ల ఒకే డీలర్‌కు రెండు, మూడేసి ఇన్‌చార్జీలు అప్పగించారు. దీంతో సకాలంలో లబ్ధిదారులకు బియ్యం చేరడం లేదు. ఇలాంటి చోట్ల కొత్తవారికి ఇస్తే కూడా అర్హులైన వారికి ఇవ్వాలనే ప్రజలు కోరుతున్నారు.

బయోమెట్రిక్ పరిశీలిస్తే తేటతెల్లం

జిల్లాలోని 18మండలాల్లో 9మండలాల పరిధిలో రేషన్ షాపుల తనిఖీలు పూర్తయ్యాయి. మరో 9మండలాల్లో ఇంకా పరిశీలనలు చేయాల్సి ఉంది. ఆయా మండలాల తహసీల్దార్లకు బాధ్యతలు అప్పగించారు. ఆ మండల పరిధిలో కింది స్థాయి డీటీ, ఆర్ఐ స్థాయి అధికారులు, పౌరసరఫరాల శాఖ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో గుర్తించాల్సి ఉంది. పరిశీలనకు వస్తున్న అధికారుల రాకను ముందుగానే తెలుసుకుని వాళ్లు తనిఖీ చేసే ముందు రోజే స్టాక్, అసలు డీలర్లు ప్రత్యక్షం అవుతున్నారు. ఇన్నాళ్లు తామే నిర్వహించామని కూడా రాత పూర్వకంగా రాసి ఇస్తున్నారు. బయోమెట్రిక్‌లో వేలిముద్రలు పరిశీలిస్తే గత కొన్ని నెలల్లో ఎవరు వేలిముద్రతో బియ్యం పంపిణీ చేస్తున్నారో తేటతెల్లం అవుతుంది. బయోమెట్రిక్ ముగ్గురికి అవకాశం ఇవ్వడంతో డీలర్ల కుటుంబ సభ్యులతోపాటు షాపులో పని చేసే వారికి కూడా నమోదు చేసి ఉంటారు. దీంతో లీజుకు ఇచ్చిన వారి వేలి ముద్రలతోనే కొన్ని షాపుల్లో ఏళ్లకేళ్లుగా దుకాణాలు కొనసాగుతున్నాయి. గతంలో కొన్ని చోట్ల ఫిర్యాదులు వచ్చినప్పటికీ మళ్లీ వారికే ఇవ్వడం గమనార్హం.

ఎవరైనా సమాచారం ఇవ్వొచ్చు

రేషన్ షాపుల్లో బినామీలను గుర్తించాలని తహసీల్దార్లను కోరాం. ఇప్పటి వరకు ఎక్కడా బినామీలు ఉన్నట్లు నివేదిక ఇవ్వలేదు. అర్హులు కాకుండా వేరే వ్యక్తులు రేషన్ షాపుల్లో ఉంటే మాకు సమాచారం ఇవ్వచ్చు.

– వాజిద్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

ప్రశాంతంగా ఇంటర్ ప్రయోగ పరీక్షలు

మంచిర్యాలఅర్బన్: ఇంటర్ ప్రయోగ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం నిర్వహించిన పరీక్షలకు 711 మంది విద్యార్థులకు 676 మంది హాజరయ్యారు. 35 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 506 మందికి 488 మంది హాజరుకాగా 18 మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్ విద్యార్థులు 205 మందిగాను 188 మంది హాజరుకాగా 17 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 453 మందికి 426 మంది హాజరయ్యారు. 27 మంది గైర్హాజరయ్యారు. ఇందులో జనరల్ విద్యార్థులు 266 మందికి 247 మంది హాజరుకాగా, 19 మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్ విద్యార్థులు 187 మందికి 179 హాజరు కాగా 08 మంది గైర్హాజరయ్యారని డీఐఈవో శైలజ తెలిపారు.

ఎంపీడీవోల బదిలీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లాలోని 16 మంది ఎంపీడీవోలు బదిలీ అయ్యారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ కమిషనర్ అనితా రామచంద్రన్ ఎంపీడీవోలను బదిలీ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని ఎంపీడీవోలు వి.ప్రవీణ్‌కుమార్, వీవీ.వరలక్ష్మి, ఎస్.శంకరమ్మ, వేముల మల్లేశ్, టి.శ్రీనివాస్, పి.సత్యనారాయణ, డి.రాజేందర్ కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీ కాగా, అబ్దుల్‌హై, కె.భాస్కర్ కె.నాగేశ్వర్‌రెడ్డి, కె.శ్రీనివాస్, ఎన్.జవహర్‌లాల్ ఆదిలాబాద్ జిల్లాకు, ఎస్.అరుణారాణి నిర్మల్ జిల్లాకు, పి.శశికళ, ఎంఏ.అలీమ్ పెద్దపల్లి జిల్లాకు బదిలీ అయ్యారు. వేమనపల్లి మండలానికి పూర్తిస్థాయి ఎంపీడీవో లేకపోవడంతో అక్కడి సూపరింటెండెంట్ ఎంపీడీవోగా వ్యవహరిస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి పలువురు ఎంపీడీవోలు మంచిర్యాల జిల్లాకు రానున్నారు. రెండు రోజుల్లో వారు విధుల్లో చేరే అవకాశం ఉంది.

ఆటో డ్రైవర్లకు అండగా ఉంటాం

- కలెక్టర్ బదావత్ సంతోష్
- ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఆధ్వర్యంలో ఉచిత వాహన బీమా పత్రాల పంపిణీ



ఆటో డ్రైవర్లకు ఉచిత వాహన బీమా పత్రాలు అందిస్తున్న కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం అండగా ఉంటుందని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో దక్షిత్ ఇన్సూరెన్స్ సంస్థ సహకారంతో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఆటో డ్రైవర్లు, ఓనర్లకు ఉచిత వాహన బీమా పత్రాలను ఆదివారం సాయంత్రం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపొద్దన్నారు. డ్రైవర్లు, వారి కుటుంబ సంక్షేమం గురించి ఆలోచించాలని తెలిపారు.

ఉచిత వాహన బీమా..

రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా మంచిర్యాల నియోజకవర్గం ఆటో సోదరులకు ఉచిత వాహన బీమా కల్పిస్తున్నామని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు తెలిపారు. ఆటో డ్రైవర్లు, ఓనర్లకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో మొత్తం 3,300 ఆటోలు ఉన్నాయని, ప్రస్తుతం 350 మందికి ఇన్సూరెన్స్ పత్రాలు అందించామని తెలిపారు. మిగతావారికి త్వరలోనే అందిస్తామని తెలిపారు. బీమాతో ఆటో యజమాని డ్రైవర్‌గా ఉన్నట్లయితే రూ.15 లక్షలు, డ్రైవర్ ప్రత్యేకంగా ఉంటే రూ.2 లక్షలు, ఆటోలో ప్రయాణించే వారికి సైతం బీమా వర్తిస్తుందని తెలిపారు. కార్మికశాఖతో మాట్లాడి రూ.6 లక్షల ఇన్సూరెన్సు వచ్చేలా చూడడంతోపాటు, ఇందిరమ్మ ఇళ్లు మూడేళ్లలో మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఆటోలను నడిపే వారిలో చాలా మందికి డ్రైవింగ్ లైసెన్సులు లేవని, వారికి ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్ ఇవ్వడం, ఆటో డ్రైవర్లకు వారంలో ఒకరోజు శిక్షణ ఇచ్చేలా ఆర్టీవో అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ పుప్పాల శ్రీనివాస్ మాట్లాడుతూ ఇన్సూరెన్సు వర్తించాలంటే తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సు, ఫిట్‌నెస్, పర్మిట్ ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోతీలాల్, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, ఆర్టీవో కిష్టయ్య, మంచిర్యాల, నస్పూర్ మున్సిపల్ చైర్మన్లు రావుల ఉప్పలయ్య, వేణు, మంచిర్యాల వైస్ చైర్మన్ సల్ల మహేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, నస్పూర్ పట్టణ అధ్యక్షుడు బండారి సుధాకర్, దక్షిత్ ఇన్సూరెన్సు చైర్మన్ సుధాకర్, నాయకులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన ఆటో డ్రైవర్లు, ఓనర్లు

సబ్సిడీ సిలిండర్లకు సర్వే!

- త్వరలోనే రూ.500లకు ఎల్‌పీజీ గ్యాస్
- తప్పుగా నమోదైన కనెక్షన్ల వివరాలు సేకరణ
- ఆన్‌లైన్‌లో వివరాల నమోదు



వివరాలు సేకరిస్తున్న మున్సిపల్ అధికారులు

జిల్లాలోని రేషన్‌కార్డుల	2,19,190
జిల్లాలో గ్యాస్ కనెక్షన్లు	2,86,130
ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులు	
2,13,037 (రూ.500లకు గ్యాస్ సిలిండర్ కోసం)	

మంచిర్యాలటౌన్: ఆరు గ్యారంటీల అమలులో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో రూ. 500లకే ఎల్‌పీజీ సిలిండర్ ఇచ్చే పథకం అమలుకు కసరత్తు చేస్తోంది. ఇందుకోసం గతేడాది డిసెంబర్ నుంచి జనవరి మొదటి వారం వరకు ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించి, అర్హులైన వారి నుంచి దరఖాస్తులను స్వీకరించింది. రూ.500లకే సిలిండర్ కావాలని దరఖాస్తు చేసే సమయంలో చాలా మంది వారి గ్యాస్ కనెక్షన్ నంబరు, కంపెనీ పేరు సరిగ్గా రాయక పోవడంతో ఇబ్బందిగా మారింది. సబ్సిడీ గ్యాస్ కోసం దరఖాస్తు చేసుకున్నవారు గ్యాస్ డెలివరీ సమయంలో ఇచ్చే గ్యాస్ బిల్ తీసుకుని, ప్రజాపాలన దరఖాస్తులు ఎక్కడైతే తీసుకున్నారో, అదే చోటకు రావాలని దరఖాస్తుదారులకు ఫోన్ చేసి చెప్తున్నారు. ప్రజాపాలన దరఖాస్తులో అన్ని వివరాలను సమగ్రంగా రాసి, అవి తప్పులు లేకుండా ఉంటే, వారు రావాల్సిన అవసరం లేదని, కేవలం సమగ్ర వివరాలు ఇవ్వని వారు, మున్సిపల్, గ్రామీణ ప్రాంతాల సిబ్బంది, అధికారులు ఫోన్లు చేసిన వారే రావాలని సూచిస్తున్నారు. ఈ నెల 10వ తేదీ వరకే సర్వేను పూర్తి చేయాలని ఆదేశాలు ఉన్నా, ఎక్కువ మంది వివరాలను తిరిగి సేకరించడంతో ఆదివారం సైతం సర్వే చేసి, గ్యాస్ కనెక్షన్ల వివరాలను సిబ్బంది తీసుకున్నారు.

సక్రమంగా ఉంటేనే...

ప్రభుత్వం గ్యారంటీల హామీల అమలు కోసం గత నెలలో ప్రజాపాలనలో తీసుకున్న దరఖాస్తులు సక్రమంగా ఉంటేనే అందులోని పథకాలకు అర్హులుగా ఎంపికవుతారు. 200 యూనిట్లలోపు విద్యుత్‌ను ఉచితంగా అందించేందుకు విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో కరెంటు బిల్లులు ఇచ్చేవారు ఇంటింటికీ వచ్చి రేషన్‌కార్డు, ఆధార్, ఫోన్ నంబర్, ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలించి, వారి వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేస్తున్నారు. గ్యాస్ కనెక్షన్ల వివరాలను మాత్రం ఇంటింటికీ వెళ్లి సేకరిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికి వెళుతుండగా, మున్సిపాలిటీల్లో మాత్రం వార్డులో ఒకచోట సిబ్బంది ఉండి, వివరాలు సేకరిస్తున్నారు. జిల్లాలో మొత్తం గ్యాస్ కనెక్షన్లు 2,86,190 ఉండగా, ప్రజాపాలన కార్యక్రమంలో గ్యాస్ సిలిండర్ రూ.500 పథకం కోసం 2,13,037 మంది దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో మొత్తం 2,19,190 రేషన్ కార్డులు ఉండగా, గ్యాస్ సిలిండర్ రూ.500లకు వచ్చిన దరఖాస్తులు రేషన్ కార్డుల సంఖ్య కంటే తక్కువగానే ఉంది. దీంతో రేషన్‌కార్డు ఉండి, రూ.500 సిలిండర్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఈ పథకం వర్తించనుంది.

తప్పుగా వచ్చిన వివరాలు సేకరిస్తున్నాం



గ్యాస్ కనెక్షన్ల నంబర్లను తప్పుగా రాయడం, కంపెనీ పేర్లను నమోదు చేయక పోవడం, కొన్ని నంబర్లను వేయక పోవడం వంటి వాటి వివరాల ప్రకారం ఆయా లబ్ధిదారుల నుంచి మరోసారి సేకరించి, ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. ఇందుకోసం గతంలో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా దరఖాస్తులను స్వీకరించిన చోటనే సిబ్బందిని ఉంచి, వివరాలను సరిగ్గా అందించని వారి నుంచి మాత్రమే మరోసారి వివరాలను సేకరిస్తున్నాం.

– మారుతి ప్రసాద్, మంచిర్యాల మున్సిపల్ కమిషనర్

ఈకేవైసీ 71 శాతమే..

- ఈనెలాఖరు వరకు గడువు



రేషన్ దుకాణంలో బియ్యం పోస్తున్న దృశ్యం..

దండేపల్లి: చౌక ధరల దుకాణాల్లో పేదలకు అందిస్తున్న రేషన్ సరుకులు పక్కదారి పట్టకుండా ఉండేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. ఆహార భద్రత కార్డులో సభ్యుడైన ప్రతీ లబ్ధిదారుడు రేషన్ దుకాణంలో ఈకేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ప్రక్రియ ప్రారంభించి నాలుగు నెలలు గడిచినా జిల్లాలో ఇప్పటి వరకు 71 శాతం మాత్రమే పూర్తయింది. ఆధార్ వేలిముద్రలు పడకపోవడం ఇతర కారణాలతో చాలా మంది ఈకేవైసీ చేయించుకోలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉండడంతో ప్రభుత్వం గడువు ఈనెల 29 వరకు గడువు పొడగించింది.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

మంచిర్యాల జిల్లాలో 423 రేషన్ దుకాణాలు ఉండగా, 2,08,000 ఆహార భద్రత కార్డులు ఉన్నాయి. వీటిల్లో 6,20,000 మంది లబ్ధిదారులు ఉన్నారు. రేషన్ కార్డులో ఉన్న ప్రతీ లబ్ధిదారుడు రేషన్ దుకాణానికి వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. ఇప్పటి వరకు 4,54,000 మంది ఈకేవైసీ చేయించుకున్నారు.

ఆధార్ అప్‌డేట్ లేక..

రేషన్ కార్డుల్లో ఎక్కువ సంఖ్యలో చిన్నపిల్లలు, వృద్ధులు ఉండటంతో, వారి వేలి ముద్రలు బయోమెట్రిక్ యంత్రంలో నమోదు కావడం లేదు. దీంతో ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని డీలర్లు రేషన్ వినియోగదారులకు సూచిస్తున్నారు. వేలి ముద్ర పడని వారందరూ ఆధార్ అప్‌డేట్ కోసం ఆధార్ కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. జిల్లాలో సరిపడా ఆధార్ నమోదు కేంద్రాలు లేకపోవడంతో, ఉన్న చోట జనాలు బారులు తీరుతున్నారు. అధికారులు స్పందించి ఆధార్ కేంద్రాల సంఖ్య పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

అందరూ ఈకేవైసీ చేసుకోవాలి..

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతీ రేషన్ వినియోగదారుడు రేషన్ దుకాణంలో ఈకేవైసీ చేయించుకోవాలి. అలాంటి వారికే సరుకులు అందుతాయి. ఈకేవైసీకి ఈ నెలాఖరు వరకు గడువు ఉంది. ఈకేవైసీ చేయించుకోని వారుంటే గడువులోగా పూర్తిచేసుకోవాలి.

– వాజిద్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

ఆకలితో ప్రత్యేక తరగతులకు..

- పదో తరగతి విద్యార్థుల ఇబ్బందులు
- కలెక్టర్ చొరవ చూపితేనే విద్యార్థులకు స్నాక్స్



ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: విద్యార్థి జీవితాన్ని మలుపు తిప్పే దశ పదో తరగతి. పబ్లిక్ పరీక్షల్లో సాధించే ఉత్తమ గ్రేడ్‌లే గీటురాయి. ప్రణాళిక అమల్లో భాగంగా పాఠ్యాంశాలను పూర్తి చేసి లక్ష్యంతో ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే పాఠశాలలకు విద్యార్థులు ఖాళీ కడుపుతో హాజరవుతున్నారు. ఇంటి వద్ద టిఫిన్ చేయకుండా హడావుడిగా బయలుదేరుతుండగా సాయంత్రం ప్రత్యేక తరగతులు పూర్తి చేసుకుని ఇంటికి వెళ్తున్నారు. ఉదయం 8:30 నుంచి 9:30 వరకు, సాయంత్రం 4:45 నుంచి 5:30 వరకు ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయి. అయితే ఉదయం అల్పాహారం, సాయంత్రం స్నాక్స్ అందకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు.

స్నాక్స్‌పై పంపిణీపై స్పష్టత ఏది..?

జిల్లాలో 115 ప్రభుత్వ పాఠశాలల్లో 3,696 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. ఉదయం హడావుడిగా పాఠశాలకు వస్తున్నారు. ప్రత్యేక తరగతుల నేపథ్యంలో గతంలో విద్యాశాఖ ప్రత్యేక నిధులు కేటాయించి స్నాక్స్ అందించింది. ఈనెల 9 నుంచి ఎస్ఎస్‌సీ స్పెషల్ టెస్ట్‌లు మొదలయ్యాయి. మార్చి 1 నుంచి ప్రీఫైనల్ పరీక్షలు మార్చి 18 నుంచి పబ్లిక్ పరీక్షలు జరుగనున్నాయి. పరీక్షలకు సమయం సమీపిస్తున్న స్నాక్స్ సరఫరాపై విద్యాశాఖ ఎటూ తేల్చడం లేదు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కలెక్టర్ చొరవ తీసుకుని స్నాక్స్‌కు నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

పదో తరగతి ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు స్నాక్స్ అందించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించా. ఇందుకు అవసరమైన నిధుల కోసం కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపించాం. నిధులు వచ్చే అవకాశం ఉంది. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాం.

– యాదయ్య, డీఈవో

ఘనంగా పెర్సపేన్ పూజలు



కేస్లాపూర్ జాతరలో భాగంగా మెస్రం వంశీయులు ఆదివారం పెర్సపేన్, భాన్ దేవతల పూజలు ఘనంగా నిర్వహించారు. మరోవైపు భక్తులు ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చి నాగోబాను దర్శించుకున్నారు.

- వివరాలు 8లో▸

క్లుప్తంగా

ఇద్దరిపై కేసు

మందమర్రిరూరల్: సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి చెప్పులదండ వేసి ఉన్న ఫొటోను వాట్సాప్ గ్రూప్‌ల్లో షేర్ చేసిన పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు బెల్లం అశోక్, వికాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎవరైన ఇతరులను అవమానించినా, రెండు వర్గాలు, పార్టీలను రెచ్చగొట్టేలా ప్రకటనలు చేసినా, సోషల్ మీడియాలో పోస్టు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

బెల్లంపల్లి: ప్రమాదవశాత్తు ఓ స్కూటీ కిందపడిపోయి మంటలు వ్యాపించిన ఘటన ఆదివారం బెల్లంపల్లిలో చోటుచేసుకుంది. వన్‌టౌన్‌లో పని చేస్తున్న మహిళా కానిస్టేబుల్ తిరుమలకు చెందిన స్కూటీని ఆమె బంధువులు తీసుకుని సోమగూడెం నుంచి బెల్లంపల్లి వైపు వస్తున్నారు. మార్గమధ్యలో బైపాస్ రోడ్డు వద్ద స్కూటీ ప్రమాదవశాత్తు కిందపడిపోయింది. ఇద్దరు అల్లంత దూరానపడిపోగా స్కూటీ నుంచి పెట్రోల్ లీకై మంటలు అంటుకున్నాయి. దీంతో సదరు వ్యక్తులు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. స్కూటీ పాక్షికంగా దగ్ధమైంది.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

కౌటాల: మండలంలోని బోదంపల్లికి చెందిన యువకుడు కొండ స్వామి(22) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఎస్.మధుకర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..కొండ విజయ్– పవిత్ర దంపతుల పెద్ద కుమారుడు స్వామి గత కొంత కాలం మద్యానికి బానిసయ్యాడు. నిత్యం ఇంట్లో గొడవలు చేసేవాడు. శనివారం విజయ్ పనికి వెళ్లగా..తల్లి పవిత్ర చిన్న కుమార్తెతో ఆసిఫాబాద్‌లో ఉంటున్న హాస్టల్‌లోని చిన్నకుమారుడిని చూడడానికి వెళ్లారు. ఈక్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో శనివారం సాయంత్రం స్వామి మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం కాగజ్‌నగర్‌కు తరలించగా.. మెరుగైన వైద్యం కోసం పంపించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. తల్లి పవిత్ర ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా ముత్యాలమ్మ జాతర



అమ్మవార్లకు జలాభిషేకం చేస్తున్న భక్తులు

కోటపల్లి: మండలంలోని ఎదులబంధంలో ఆదివాసీ నాయక్‌పోడ్ సంప్రదాయాల ప్రకారం ముత్యాలమ్మ జాతర ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. తొలిరోజు ముత్యాలమ్మతోపాటు లక్ష్మీదేవర, మధునపోచమ్మ అమ్మవార్లకు పార్‌పల్లిలోని ఉత్తరవాహిని గోదావరి నదిలో పుణ్యస్నానం ఆచరించేందుకు భక్తులు కాలినడకన వచ్చారు. పుణ్యస్నానాలు తర్వాత అమ్మవార్లకు గిరిజనులు పూజలు చేశారు. తర్వాత గ్రామానికి చేరుకున్న అమ్మవార్లకు భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు. సాయంత్రం మధునపోచమ్మకు బోనాలు సమర్పించారు. సోమవారం లక్ష్మీదేవర బోనాలు, ముత్యలమ్మ జాతర నిర్వహిస్తున్నట్లు పూజారి జేక లచ్చయ్య తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించినట్లు ఎంపీటీసీ జేక శేఖర్ పేర్కొన్నారు.



భక్తులపై గోదావరి జలాలు చల్లుతూ..



కోనేరు బావి నుంచి పవిత్ర జలం తీసుకువస్తున్న కొత్త కోడళ్లు, అల్లుళ్లు



భాన్‌దేవత ఆలయానికి వస్తున్న మెస్రం వంశీయులు



రంగుల రాట్నాల వద్ద యువతీ, యువకుల సందడి

ఘనంగా పెర్సపేన్ పూజలు

ఇంద్రవెల్లి: కేస్లాపూర్‌లో మహాపూజతో నాగోబా జాతర ప్రారంభించిన మెస్రం వంశీయులు పెర్సపేన్, భాన్ దేవతల పూజలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గోవడ్ నుంచి సంప్రదాయ వాయిద్యాలతో భాన్ దేవత ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. బేటింగ్ అయిన కొత్త కోడళ్లు కోనేరు వద్దకు వెళ్లి పవిత్ర జలం తీసుకురాగా.. మెస్రం వంశం అల్లుళ్లు ఆలయం ఎదుట పాత పుట్టలను తొలగించారు. ఆడపడుచులు, మహిళలు పవిత్ర జలంతో కొత్త పుట్టలను తయారు చేయడంతోపాటు భాన్ దేవతలను శుద్ధి చేశారు. తర్వాత మెస్రం వంశీయులు నాలుగు సగల పెర్సపేన్(పెద్ద దేవుల)ను కొలిచారు. గోదావరి నుంచి తీసుకువచ్చిన పవిత్ర గంగాజలంతో శుద్ధిచేసి మొక్కుకున్నారు. ఇందులో మెస్రం వంశం పురుషులు పాల్గొన్నారు. నెల 13న గోవడ్ ముఖద్వార వద్ద బేతల్ పూజలు చేసి మెస్రం వంశీయుల ముగించనున్నట్లు నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ తెలిపారు.

నాగోబా చరిత్ర, 22 కితల బోధన

గోవడ్ వద్ద బస చేసిన మెస్రం వంశీయులకు సంప్రదాయ వంటకాలతో సహపంక్తి భోజనాలు చేశారు. ఆదివారం ప్రధాన్ కితకు చెందిన మెస్రం గంగారం ఆధ్వర్యంలో కిక్రి వాయిస్తూ కొత్త కోడళ్లు, మెస్రం వంశం మహిళలకు నాగోబా చరిత్ర, 22 కితలను బోధించారు. మెస్రం వంశీయులకు కానుకలు అందజేశారు. మెస్రం దాదారావ్, మెస్రం తిరుపతి, మెస్రం రామ తదితరులు ఉన్నారు.



పెర్సపేన్ పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు



భాన్,పేర్సపేన్ పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు



కోనేరు బావి నుంచి పవిత్ర జలం సేకరిస్తున్న బేటి కోడళ్లు



పుట్ట వద్ద పూజలు చేస్తూ..



పెద్దపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తిని సన్మానిస్తున్న మెస్రం వంశీయులు

కొనసాగుతున్న జాతర



క్యూలో భక్తులు

నాగోబా జాతర కొనసాగుతోంది. ఆదివారం ఉమ్మడి జిల్లా నుంచే కాక తెలంగాణ, మహారాష్ట్రల నుంచి భక్తులు తరలివచ్చారు. నాగోబా ఆలయంలో పూజలు చేశారు. పెద్దపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి దుర్గే గణేశ్ నాగోబా ఆలయంలో పూజలు చేశారు. మెస్రం వంశీయులు ఆయన్ను సన్మానించి నాగోబా ప్రతిమ అందించారు. జాతరలో ఏర్పాటు చేసిన దుకాణ సముదాయాల వద్ద చిన్నారులతో సందడిగా మారింది.



నాగోబాకు మొక్కుతున్న యువతులు

షిఫ్ట్ మార్చారని కార్మికుడి ఆత్మహత్యాయత్నం

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్‌పీ–1 గనిలో జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వహిస్తున్న కొట్టె వెంకటేశ్ అనే కార్మికుడు తన షిఫ్ట్ మార్చారని మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. తోటికార్మికులు తెలిపిన వివరాలు.. వెంకటేశ్ గత కొన్నేళ్లుగా ఇంజినీరింగ్ సెక్షన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఈక్రమంలో అతడిని యాజమాన్యం కొన్నిరోజుల క్రితం షిఫ్ట్‌లోకి మార్చింది. దీంతో అతడు మనస్తాపం చెంది ఆర్ అండ్‌ఆర్ కాలనీలోని తన నివాసంలో ఆదివారం పురుగుల మందు తాగాడు. మిత్రుడు వెంకటేశ్‌కి ఫోన్ చేయగా స్విచ్ఛాప్ రావడంతో వచ్చి చూసేసరికి అపస్మారక స్థితిలో ఉన్నాడు. వెంటనే అతడిని మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వెంకటేశ్‌ని ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ నాయకులు పరామర్శించారు.

'ఏఐటీయూసీపై అసత్యపు ప్రచారాన్ని ఖండిస్తున్నాం'

వెంకటేశ్ ఆత్మాహత్యాయత్నానికి తమ సంఘం కారణమని ఐఎన్‌టీయూసీ నాయకులు చేస్తున్న అసత్యపు ప్రచారాన్ని ఖండిస్తున్నామని శ్రీరాంపూర్ బ్రాంచి సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఎస్ఆర్‌పీ–1 ఫిట్ సెక్రెటరీ దాడి రాజయ్య తెలిపారు. ఆదివారం సీసీసీలోని ఏఐటీయూసీ కార్యాలయంలో వారు మాట్లాడారు. ఎస్ఆర్‌పీ–1 గనిలోని ఇంజినీరింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న సుమారు 15 మంది కార్మికులను యాజమాన్యం షిఫ్ట్‌లకు బదిలీ చేసిందని, అందులో కొట్టె వెంకటేశ్‌ని బదిలీ చేసిందన్నారు. అతని ఆత్మహత్యాయత్నానికి తమ యూనియన్‌కు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఆర్గనైజింగ్ కార్యదర్శి స్వామి, నాయకులు అనంతరెడ్డి, ప్రకాశ్‌రావు, ఓదెలు, వంశీ, శీను, అక్బర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



వెంకటేశ్‌ని పరామర్శిస్తున్న సీఐటీయూ నాయకులు

నేడు నాగోబా దర్బార్

- ఏర్పాట్లు పూర్తి
- హాజరుకానున్న మంత్రి సీతక్క

ఇంద్రవెల్లి: నాగోబా జాతరలో భాగంగా కేస్లాపూర్‌లోని ఆలయంలో నేడు దర్బార్ నిర్వహించనున్నారు. ఉదయం 11గంటలకు ఆలయ ప్రాంగణంలోని హాల్‌లో ఈ కార్యక్రమం చేపట్టనున్నారు. ఐటీడీఏ పరిధిలోని గిరిపుత్రులు భారీగా పాల్గొననున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతో పాటు ఎంపీ సోయం బాపూరావు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఇన్‌చార్జి పీవో ఖుష్బూ గుప్తా, తదితరులు హాజరుకానున్నట్లు ఈవో రాజమౌళి తెలిపారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణ కోసం ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలపై ఆదివాసీలకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

దర్బార్ చరిత్ర ఇది..

జాతరలో భాగంగా నిర్వహించే దర్బార్‌కు ప్రత్యేక చరిత్ర ఉంది. జల్.. జంగల్.. జమీన్ నినాదంతో నిజాం సర్కార్‌తో పోరాడిన కుమురంభీం 1940లో అమరుడయ్యారు. భీమ్ పోరాటానికి ఉలిక్కిపడ్డ నిజాం సర్కార్ ఆదివాసీ గిరిజనుల సమస్యలపై అధ్యయనం చేసేందుకు ప్రొఫెసర్ హైమాన్‌డార్ఫ్‌ను ఇక్కడికి పంపించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు వచ్చిన ఆయన జైనూర్ మండలం మార్లవాయిని ఎంచుకొని అక్కడే ఉంటూ ఆదివాసీ గిరిజన గ్రామాలను సందర్శించారు. ఈ క్రమంలో 1946లో కేస్లాపూర్ చేరుకున్నారు. మెస్రం వంశీయులు పుష్యమాసంలో నిర్వహించే నాగోబా జాతర విషయం తెలుసుకొని వారితో కలిసి పూజలు చేశారు. వారం పాటు అక్కడే ఉండి వారి సమస్యలు తెలుసుకున్నారు. నాగోబా దర్బార్ పేరుతో సమావేశమై ఆక్వామే కదీం(ఆదివాసీ సంక్షేమ శాఖ కమిటీ)ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఏటా దర్బార్ నిర్వహిస్తూ ఆదివాసీల సమస్యలు, స్థితిగతులు తెలుసుకునేవారు. 1981 ఇంద్రవెల్లి ఘటన తరువాత 1983 నుంచి ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ దర్బార్‌ను నిర్వహిస్తోంది. ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వాటిని పరిష్కరిస్తోంది.



సమావేశానికి ముస్తాబైన నాగోబా దర్బార్ హాల్

బాలిక కిడ్నాప్ కలకలం



సుమిత్రను వివరాలు అడిగి తెలుసుకుంటున్న పోలీసులు

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలో ఆరేళ్ల బాలిక కిడ్నాప్‌కు యత్నించిన ఘటన ఆదివారం కలకలం రేపింది. ఎస్సై జగదీశ్ కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు చెందిన అశ్విని–మహేశ్ దంపతులు అదితి(6) కుమార్తెతో కలిసి శనివారం జిల్లా కేంద్రంలోని ఏసీసీ వద్ద నివాసం ఉంటున్న బంధువు సాయిప్రకాశ్ ఇంట్లో సమ్మక్క పూజకు వచ్చారు. ఆదివారం శ్రీనివాస్ గార్డెన్ సమీపంలో అపార్ట్‌మెంట్‌లో ప్లాట్ చూసేందుకు అందరూ కలిసివెళ్లారు. అపార్ట్‌మెంట్ వద్ద అదితి ఆడుతుండగా దేవాపూర్‌కు చెందిన సుమిత్ర తీసుకెళ్తుండగా కొంత దూరం వెళ్లాక ఏడ్చింది. సుమిత్ర ప్రవర్తనపై స్థానికులకు అనుమానం వచ్చి చితకబాది స్తంభానికి కట్టేశారు. పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని సుమిత్రను స్టేషన్‌కు తరలించారు. బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించారు. సుమిత్రపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, గత రెండు నెలల నుంచి శ్రీనివాసగార్డెన్ వద్ద అద్దె ఇంట్లో ఒంటరిగా సుమిత్ర ఉండి కూలి పనిచేస్తున్నట్లు తెలిసింది.



కుటుంబ సభ్యులతో అదితి

ప్రశాంతంగా గురుకుల సెట్

జిల్లాల వారీగా వివరాలు

జిల్లా	పరీక్ష కేంద్రాలు	విద్యార్థుల సంఖ్య	హాజరైన వారు
ఆదిలాబాద్	08	2,727	2,628
కుమురం భీం	09	2,782	2,637
మంచిర్యాల	08	3,335	3,157
మొత్తం	25	8,844	8,422

బెల్లంపల్లి: తెలంగాణ గురుకుల కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (టీజీసెట్) ఆదివారం ఆదిలాబాద్ రీజియన్‌లో ప్రశాంతంగా జరిగింది. 2024–25 విద్యాసంవత్సరంలో ఐదో తరగతిలో ప్రవేశం కోసం ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకులాలు, మహాత్మా జ్యోతిబాపూలే (బీసీ సంక్షేమ), గిరిజన సంక్షేమ, ప్రభుత్వ గురుకుల (టీఎస్ఆర్ఎస్) విద్యాలయాలు ఉమ్మడిగా ప్రవేశపరీక్ష నిర్వహించాయి. రీజియన్ పరిధి ఆదిలాబాద్, కుమురం భీం, మంచిర్యాల జిల్లాల్లో 8,844 మంది విద్యార్థులు ప్రవేశపరీక్షకు దరఖాస్తు చేసుకోగా, వీరిలో 8,422 మంది హాజరుతో 95.23 శాతం నమోదైంది. మరో 422 మంది గైర్హాజరైనట్లు ఆదిలాబాద్ రీజియన్ కోఆర్డినేటర్ స్వరూపరాణి తెలిపారు. రీజియన్ వ్యాప్తంగా 25 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

కేంద్రాలకు గంట ముందుగానే..

ప్రవేశపరీక్ష ఉదయం 11 గంటలకు ఉండగా తల్లిదండ్రులు, తోబుట్టువులతో కలిసి విద్యార్థులు కేంద్రాలకు గంట ముందుగానే చేరుకున్నారు. వారిని పరీక్షించి లోనికి పంపించారు. పరీక్ష హాల్‌లో ఓఎంఆర్ షీట్ బబ్లింగ్‌పై అవగాహన కల్పించి, 11 గంటలకు ప్రశ్నాపత్రాన్ని అందజేశారు. మధ్యాహ్నం 1 గంటకు పరీక్ష ముగిసింది. కాగా, పరీక్ష కేంద్రాల్లో ఎండతీవ్రత దృష్టిలో పెట్టుకుని కుండలు, రంజన్లలో తాగునీటిని అందుబాటులో ఉంచారు. ముందస్తుగా ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు ఏర్పాటు చేశారు.

పరీక్ష కేంద్రాల సందర్శన

బెల్లంపల్లిలో నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలను గిరిజన సంక్షేమ గురుకుల అసిస్టెంట్ సెక్రెటరీ జీఎం, ప్రత్యేక పరిశీలకుడు వెంకటేశం, బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ సందర్శించారు. ఆయా కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని ఏర్పాటుచేసిన సీఓఈ పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఐనాల సైదులు, ఇతర చీఫ్ సూపరింటెండెంట్లను వెంకటేశం అభినందించారు.



బెల్లంపల్లిలోని కేంద్రంలోకి వెళ్తున్న ఓ విద్యార్థి

కాలువలపై అక్రమ నిర్మాణాలు

మందమర్రిరూరల్: మున్సిపాలిటీలోని మార్కెట్ ఏరియాలో లక్షలాది రూపాయలతో నిర్మించిన కాలువలపై అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో ప్రజలకు ఇబ్బంది తప్పడం లేదు. కాలువలపై షాపుల యజమానులు నిర్మాణాలు చేపట్టడంతో రోడ్డు చిన్నగా మారింది. దీంతో వర్షపు నీరు రోడ్డుపై పారుతోంది. అంతేకాకుండా షాపుల పైనుంచి విద్యుత్ లైన్ ఉండగా యజమానులు అధికారులతో మిలాఖాత్ అయి విద్యుత్ తీగలు మరింత రోడ్డు వైపునకు జరిపి ప్రమాదకరంగా వేయించడం గమనార్హం. మార్కెట్ ఏరియాలో కొన్నిమాల్స్ ఏర్పాటు చేసినా వాటి ముందు వాహనాలు నిలపడానికి చోటు లేకనే రోడ్డుపై నిలుపుతున్నారు. దీంతో వాహనదారులు, పాదచారులకు మరింత ఇబ్బందికరంగా మారింది. మున్సిపల్ అధికారులు స్పందించి నిర్మాణాలు తొలగించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



బెజ్జూర్ అడవులకు ట్రెయినీ ఎఫ్ఎస్‌వోలు

బెజ్జూర్: దూలపల్లి ఫారెస్ట్ అకాడమీ అసిస్టెంట్ డైరెక్టర్ రామ్మోహన్ ఆధ్వర్యంలో ట్రెయినీ ఎఫ్ఎస్‌వోలు ఆదివారం బెజ్జూర్ మండలంలోని అడవులను సందర్శించారు. రేంజ్ పరిధిలోని ఇందిరిగాంలో గడ్డి మైదానాలు, రాముడు భీముడు వృక్షాలు, టేక్ ప్లాంటేషన్ తదితర అభివృద్ధి పనులను పరిశీలించారు. అడవుల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు, అటవీ సంరక్షణ కోసం తీసుకుంటున్న చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రేంజ్ అధికారి దయాకర్, డిప్యూటీ రేంజ్ అధికారి శ్రావణ్‌కుమార్, బీట్ అధికారి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.